


*(గత సంచిక తరువాయి)*

కొన్ని క్షణాలు ఎవరూ ఏం మాట్లాడలేదు. జగదీశ్ నేలవైపు చూస్తూ ఉండిపోయాడు.

సునందే ధైర్యం చేసుకుని "బావగారూ, నెల రోజుల్లో అంత దూరం ప్రయాణమంటే వీలయ్యేలా లేదు. పైగా..."

"పైగా...?"

"డబ్బండీ...ఒక్కసారి మా బ్రదరు గుండె జారిపోయింది చూశారా ఇక్కడ? ఎంత లేదైనా ఆ గ్రహానికి రావాలంటే రెండు మూడు కోట్లవ్వదూ?" అన్నాడు మల్లి.

"పది కోట్లు!" సరి చేశాడు మహా.

"చెప్పానా... మా అన్నయ్యకది పెద్ద లెక్క కాకపోయినా చూస్తూ చూస్తూ ఒక ఫ్యామిలీ ప్రయాణానికి పది కోట్లంటే..."

"ఫ్యామిలీకి కాదు, ఒక్కొక్కళ్ళకీ పది కోట్ల రూపాయలవుతుంది!"

ఒక్కసారి ఆ రూంలో అందరి మొహాలూ ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్టు నల్లగా మాడిపోయాయి.

*"ఇది చచ్చినా జరగదైతే"* అనుకున్నాడు రిషీ. తనకి బాగా తెలుసు ఏ లాభం లేకుండా జగదీశ్ ఇంత తగలెయ్యడని.

మహాకీ అర్థమయ్యి "మీ ఆరుగురికీ షుమారు అరవై కోట్లవుతుంది. కాకపోతే నేను నాసా లో ముప్పై ఏళ్ళుగా చేస్తున్నాను కాబట్టి తగ్గించమని రిక్వెస్ట్ చేస్తాను. కానీ ఒక ముప్పై కోట్లైతే గ్యారంటీగా పెట్టాల్సుంటుంది మీ వైపు నుండి." అన్నాడు.

కొంచెం తేలిక పడుతోంది వాతావరణం అది విని.

"పెదనాన్నా, నాదో ఐడియా. ఈ పెళ్ళి ని అమ్మేద్దాం!" అందో కొత్త గొంతు. నీలూ ది.

అందరూ నమ్మలేనట్టు చూశారు తన వైపు. సన్నగా, చిన్నపిల్లలా, స్ట్రైప్డ్ స్కర్ట్, పోనీ టైల్ లో ఉంది తను. తన ముందు గాల్లో చిన్న స్క్రీన్ ప్రొజెక్ట్ అవుతోంది. దాంట్లో నే ఏదో ఫొటో ఫీడ్ చూస్తోంది. ఒకప్పటి మొబైల్స్ పోయి వాటి స్థానంలో ఈ వర్చువల్ స్క్రీన్స్ వచ్చి కుర్చున్నాయి. రిస్ట్ బ్యాండ్ నుంచీ, కళ్ళజోడు నుంచీ ఇలా ఎక్కడి నుంచైనా గాల్లో ప్రొజెక్ట్ చేసుకుని ఆ స్క్రీన్ తో పని చేసుకోవచ్చు.

"పెళ్ళిని అమ్మడమేంటే?" అంది సునంద నీలూని చూస్తూ.

"ఆంటీ, మొన్న మా ఫ్రెండ్ ఓ పెద్ద వాల్కనో లో పెళ్ళి చేస్కోని, దాని లైవ్ కవరేజ్ రెండు కోట్లకి అమ్మాడు. దాన్ని బిడ్డింగ్ చేసి మరీ TV420 వాళ్ళు కొని టెలి కాస్ట్ చేశారు." అంది స్క్రీన్ లోంచి తల తిప్పకుండానే.

"TV420 నా అదేం పేరు?!" అన్నాడు మహా నవ్వుతూ.

"అంకుల్, ఉన్న న్యూస్ ఛానెల్స్ లో ఇదే కొంచెం బెటరంకుల్, మిగతావి ఇంకా దారుణం!" అంది ఫీలయినట్టు మొహం పెట్టి.

మళ్లి అందుకొని "దీనికి కొంచెం న్యూస్ ఛానెళ్ల పిచ్చెక్కువ లేండి. రోజూ అదే పని. అంటే పొలిటికల్ సైన్స్ కోర్స్ చేస్తుంది కదా, టీవీ తో నాలెడ్జ్ వస్తుందని..."

"నాన్నా, నీకెన్ని సార్లు చెప్పాలి? నేను చదివేది పొలిటికల్ సైన్స్ కాదు, పొలిటికల్ ఫ్యాషన్!"

ఇప్పుడు ఖంగుతినడం విశా ఫ్యామిలీ వంతయ్యింది.

"అంటే?" అంది విశా అయోమయంగా.

“అయ్యో వదినా! ఇది చాలా హాట్ కోర్స్ ఇప్పుడు. పొలిటికల్ లీడర్స్ కి ఎలాంటి డ్రెస్సులు డిజైన్ చెయ్యాలి? స్థలాన్నీ, అకేషన్ నీ బట్టి వాళ్ళ వేషం ఎలా ఉండాలి? ఎలా రెడీ ఐతే అక్కడి జనాలు ఎక్కువ రేటింగ్ ఇస్తారు? ఎలా ప్రచారానికెళ్తే సక్సెస్ అవుతారు? ఇలాంటివెన్నో నేర్పుతారు.” అంది ఎక్సైటింగ్ గా.

“వావ్! ఎప్పుడూ నేనూ వినలేదే.” అన్నాడు రిషీ.

“యా అన్నయ్యా, నేనీ మధ్యే ఓ ఎమ్మెల్యే క్యాండిడేట్ కి వర్క్ చేస్తున్నా, నా ఫైనల్ ఇయర్ ప్రాజెక్ట్ లో పార్టుగా.” అంది కాలరెగరేస్తున్నట్టు చూపించి.

“సరే, సరే ముందు ఆ TV420 గురించి చెప్పు.” అన్నాడు జగదీశ్. ఎవడి టెన్షన్ వాడిది!

“ఆ TV420 కి ‘మొట్టమొదటి గ్రహాంతర వివాహం’ అని చెప్పి కనీసం అన్న పెళ్ళిని పదికోట్లకి అమ్మచ్చు.” అంది.

నోరు తెరిచారందరూ. జగదీశ్ తన భుజాలు పట్టుకొని ఊపేస్తూ “నువ్వు నా తల్లోంచి దూరొచ్చావే.” అన్నాడు సంతోషంగా.

రిషీ ఊపిరి పీల్చుకున్నాడు.

“బలే వారే, మే ఒక్కళ్ళం వస్తే సరిపోద్దా? మా అన్న బలగం అంతా ఏమైపోవాలి?” అన్నాడు మళ్లి అనవసరంగా.

“భూమ్మీద ఓ పెద్ద ఫంక్షన్ హాలు తీస్కోని ఇక్కడి నుండి పెళ్ళిని 3డి ప్రొజెక్షన్ చేద్దాం. ఏమంటారు?” అన్నాడు మహా.

“అనేదేముందండీ, నిశ్చితార్థం పెట్టేస్కోడమే!” అని హడావిడిగా లగ్న పత్రిక రాసేసి పెద్దగా అందరికీ చదివి వినిపించాడు పురోహితుడు స్వలా.

రిషీ దొక్కల్లో పొడుస్తూ “మీ మామని ముందు పెద్ద నస గాడనుకున్నారా, కాదూ నాసా గాడే!” అన్నాడు మళ్లి.

5

నిశ్చితార్థం హడావిడి అయ్యాక బాగా టైర్ అయ్యిపోయారందరూ. మల్లి వాళ్ళ ఫ్యామిలీని కూడా అక్కడే డిన్నర్ చేసి వెళ్ళమంది సునంద. మల్లి వాళ్ళావిడ వైపు చూశాడు ఇబ్బందిగా. అవేమీ పట్టించుకోకుండా "సుందరీ, సుందరీ!" అని పిలిచింది సునంద.

"ఏంటమ్మా?" అంటూ హడావిడిగా లోపలి నుండి వచ్చింది సుందరి. పసుపు చూడీదార్, పొడుగు జుట్టూ, పెద్ద కళ్ళూ. "సుందరీ, ఒక ఇరవై రోటీలూ, మూడు కర్రీలూ, ఫ్రైడ్ రైస్ చెయ్యాలి, ఒక అరగంటలో!" ఆర్డర్ వేసింది.

"అమ్మా, ఇంత హ్యాపీ మూమెంట్ లో మంచి స్వీట్ కూడా ఉంటే అల్టిమేట్ గా ఉంటుంది. సుందరీ, ప్లీజ్ బొబ్బట్లని నీ మెనుకి యాడ్ చేస్కోవా." అన్నాడు రిషీ తేలిగ్గా.

"అన్నయ్యా, ఇంత చేశాను నీ కోసం మరి నాకో." అంది నీలూ.

"అడగవే నీకేం కావాలో, సుందరి నీకేం కొత్తా ఏంటి?" అన్నాడు.

"ఉమ్...నాకు చాక్లెట్ ఫిల్ డ్ కజ్జికాయలు కావాలి." అంది పైకి చూసి ఆలోచిస్తూ.

"ఇంకా నయ్యం, చాక్లెట్ డిప్ డ్ బజ్జీలన్లేదు!" అన్నాడు మల్లి నీలూ వైపు చెయ్యి చూపిస్తూ.

"గుడ్ ఐడియా నాన్నా, సుందరీ అది కూడా యాడ్ చేస్కో." అంది నీలూ.

"రేయ్...పాపం సుందరి ఎంత రోబోట్ ఐతే మాత్రం దానికున్నవీ రెండు చేతులే. సుందరీ, ఈ స్వీట్లన్నీ తర్వాత చెయ్యచ్చులే కానీ, డిన్నర్ కి కావాల్సినవి చెయ్యి ముందు." అన్నాడు జగదీశ్ వాళ్లందరి మాటల్నీ కట్ చేస్తూ.

"థాంక్స్ జగదీశ్, అయినా ఈ బొబ్బట్లూ, కజ్జికాయలూ చేసే ఓపికా, నేర్చుకునే ఇంట్రస్టూ ఎప్పుడో చచ్చిపోయాయి నాకు." అంది సుందరి కిచెన్లోకెళ్ళి పోతూ.

రిషీ, నీలూ మొహాలు పాలిపోయాయి.

"ఇక్కడొద్దులే వదినా, మా ఇంటికెళ్తాం. దగ్గరే కదా, మా హౌస్ రోబోట్ కూడా చకచకా చేసేస్తుంది వంట." అన్నాడు మల్లి.

“వంట కోసం కాదు. అందరం కలిసి తిందామని. అయినా సుందరికే, మా ఇంటికొచ్చి పదేళ్ళైనా చక్కగా చేస్తుంది అన్ని పనులూ.” అంది తన రోబోట్ ని వెనకేసుకొస్తూ.

“అదే సమస్యక్కా, పదేళ్ల పాత రోబోట్ అవ్వడం వల్ల సుందరి వంటల్లో ఉప్పులూ, కారాలూ ఎక్కువ. నూనెలు కూడా ఎక్కువ వాడుతుంది, ఈయనకవన్నీ పడవు కదా...” అంది మల్లి భార్య పెదవి విరుస్తూ.

“వదినా, మీరూ కొత్తది తీస్కోవచ్చు కదా ఆ పాత రోబోట్‌ని పట్టుకుని వేళ్లాడకపోతే? నన్ను చూడండి రెండేళ్లకోసారి మా రోబోట్‌ని మారుస్తూ ఉంటాను. చాలా కొత్త కొత్త ఫీచర్స్ తో వస్తున్నాయి మధ్య.” అన్నాడు మల్లి.

జగదీశ్ కి విసుగు పుట్టి “ఎంత కొత్తవైనా, పనులు అవే కదరా, ఏముందంత స్పెషల్?” అన్నాడు.

“బలేవోడివన్నయ్యా, మీ సుందరి చెప్తే చేస్తుంది పనులు. అదే మా రోబోట్ అయితే మన మనసు తెలుసుకోని మరీ చేస్తుంది. ఓ రోజు దీనికి బాలేదని తెలుసుకోని అదే ట్యాబ్లెట్లు తెచ్చి మరీ ఇచ్చింది, కదే?” అన్నాడు భార్య వైపు చూస్తూ. తలూపింది తను.

“అంతెందుకు, ఈ వారం మొదట్లో ఇది ఇంట్లో లేనప్పుడు నాకో చిలిపి ఆలోచనొస్తే...”

“వస్తే...? ఏంటండీ...?” దబాయించింది వాళ్ళావిడ కళ్ళురిమి చూస్తూ.

మిగిలిన అందరూ నోరు తెరిచారు.

“నా దగ్గరి కొచ్చి మొహంలో మొహం పెట్టి...”

“నాన్నా...!”

“పిచ్చి పిచ్చి ఆలోచనలు చెయ్యద్దు అని బెదిరించిందే నీలాగా.” అన్నాడు భార్య వైపు చూసి వెకిలిగా నవ్వుతూ.

“వామ్మో, వామ్మో...మార్చెయ్యండి, వెంటనే మార్చెయ్యండి... నాకస్సలు నమ్మకం లేదు మళ్ళీ ఇలాంటివి జరగవని.” అంది గుండెలు బాదుకుంటూ మల్లి భార్య.

“అది మంచి పనే చేసింది గదే, దాన్నెందుకంటావ్?” అడిగింది సునంద.

“దాని మీద కాదొదినా, ఈయన మీద నమ్మకం లేక.” అంది తను ముక్కెగబీలుస్తూ.

"అవున్నాన్నా, వెంటనే మార్చేసి ఒక యంగ్ టీనేజ్ మేల్ రోబోట్ ని తీస్కుందామా?" అంది నీలూ హుషారుగా.

"అస్సలు కుదరదు...ఆ మోడల్స్ సరిగ్గా పన్చెయ్యవంట." అన్నాడు మల్లి కట్ చేస్తూ.

"బాబాయ్...మీ హౌస్ రోబోట్ పురాణం ఆపుతారా ఇంక!" అన్నాడు రిషీ తల విదిలిస్తూ.

"ఆపుతాం కానీ, మీ ఓల్డ్ సుందరిని మార్చి కొత్త సుందరాంగిని తెచ్చుకోండి." అన్నాడు మల్లి.

"అబ్బ, చిన్నగా మాట్లాడండీ! మొన్నిలాగే, తనని వదిలించుకుంటున్నారని అనుమానమొచ్చి, ఓ రోబోట్, వాళ్ళ ఓనర్స్ ని నీళ్ళు తాగించి మర్డర్ చేసిందంట." అంది వాళ్ళావిడ.

"నీళ్ళు తాగించి చంపడమేంటే, అర్ధం లేకుండా! విషం తాగించేమో?"

"నీళ్ళేనండీ! స్విమ్మింగ్ పూల్ నీళ్ళు. పూల్ లోకి తోసి, తల గట్టిగా ముంచి..."

"ఆపెయ్, నువ్వా నీ హారర్ మూవీ డీటైల్సూ!" అంటూ చెవులు మూసుకున్నాడు మల్లి.

తర్వాత భోజనం చేస్తున్నప్పుడు డైనింగ్ టేబుల్ మీద సుందరిని అనుమానంగా చూస్తూ, తన చేతికి ఎలాంటి షార్ప్ వస్తువులు దొరక్కుండా దాచేశాడు మల్లి !

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments